వాటర్ ప్లాంట్ ప్రారంభం

సనత్‌నగర్: అశోక్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాల (సనత్‌నగర్ ఓల్డ్)లో డీబీఎస్ టెక్ సౌజన్యంతో నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను గురువారం డీబీఎస్ టెక్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ ప్రారంభించారు. పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందని ప్రధానోపాధ్యాయులు మార్థ అన్నారు. అంతే కాక విద్యార్థులకు భోజనశాల షెడ్డు, సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసినందుకు నిర్మాణ్ సంస్థ, డీబీఎస్ టెక్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాధురి, అనూష, అనిల్‌కుమార్, నిఖిల్ పాల్గొన్నారు.

చిన్న చిత్రాలను ఆదరించండి

సనత్‌నగర్: ప్రేక్షకులు చిన్న చిత్రాలను కూడా ఆదరించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. జాగృతి మూవీ మేకర్స్ బ్యానర్‌పై హీరో వరుణ్‌సందేశ్, మధులిక జంటగా ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో నిర్మించిన కానిస్టేబుల్ చిత్రంలోని మేఘం కురిసింది అనే పాటను గురువారం ఆయన వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖలో కానిస్టేబుల్ విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులు, కుటుంబ నేపథ్యం, సస్పెన్స్, థ్రిల్లర్‌తో నిర్మించిన చిత్రం విజయవంతం కావాలన్నారు. సినీ పరిశ్రమలో తాము కూడా రాణించాలనే లక్ష్యంతో కొత్త నటీనటులు వస్తున్నారని, వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో లష్కర్ జిల్లా సాధన సమితీ అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, డైరెక్టర్ ఆర్యన్ సుభాన్, నిర్మాత బలగం జగదీష్, బీఆర్‌ఎస్ నేతలు జగ్గయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకురాలికి గవర్నర్ అభినందనలు

సనత్‌నగర్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్న బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నందవరం మృదులను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అభినందించారు. రాజ్‌భవన్‌లో గురువారం గవర్నర్‌ను కలిసిన మృదుల ఆమె అందిస్తున్న సర్వీసు వివరాలను వివరించారు. అలాగే కళాశాలలో జరిగే విద్యాత్మక విషయాలను ఆయన ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. దాదాపు రెండు దశాబ్దాల అనంతరం ఉన్నత విద్యా విభాగంలో అత్యున్నత అవార్డును అందుకోవడం, అందులోనూ తెలంగాణ రాష్ట్రం నుంచి ఏకైక అధ్యాపకురాలు జాతీయ స్థాయి గుర్తింపునకు ఎన్నిక కావడం గర్వించదగ్గ విషయమని ఈ సందర్భంగా గవర్నర్ కొనియాడారు.

నాడు చెత్తకు నిలయం.. నేడు చలివేంద్రం



సనత్‌నగర్: ప్రతిరోజూ ఆ ప్రాంతంలో చెత్త డంప్ చేస్తుంటారు. అక్కడ చెత్త వేయవద్దంటూ పారిశుద్ధ్య విభాగం అధికారులు విజ్ఞప్తి చేసినా పరిస్థితుల్లో మార్పు మాత్రం రావడం లేదు. దీంతో వారిలో ఒక ఆలోచన మెరిసింది. అక్కడ చెత్త డంపింగ్‌కు అలవాటు పడ్డ ప్రజలకు చెక్ పెట్టేలా ఆ ప్రాంతాన్ని క్లీన్ చేసి కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి సహకారంతో అక్కడ చలివేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వేసవిలో బాటసారుల దప్పికను తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు ఆవశ్యకమన్నారు. ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా నీటిని ఎక్కువగా తీసుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. మరింతమంది దాతలు ముందుకువచ్చి మరిన్ని చలివేంద్రాల ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ సిబ్బంది అరవింద్, వెంకటేష్, లైబ్రేరియన్ హరిబాబు, బీఆర్‌ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, ఖలీల్‌బేగ్, పాజిల్, హనుమంతరావులతో పాటు మీనా స్కూల్ వెంకట్, పవన్, రాజశేఖర్, సత్యనారాయణయాదవ్, శంకర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

అడ్డగుట్ట: టీబీ వ్యాధితో బాధపడుతున్న వారు మంచి పౌష్టికాహారం, మెడికేషన్‌ను పాటిస్తే పూర్తి స్థాయిలో వ్యాధిని నివారించవచ్చని టీబీ మెడికల్ ఆఫీసర్ సౌమ్య తెలిపారు. టీబీ అలర్ట్ ఇండియా సహకారంతో గురువారం అడ్డగుట్ట, తుకారాంగేట్ తదితర ప్రాంత్రాల్లో టీబీ వ్యాధితో బాధపడుతున్న 15 ఏళ్ల వారికి పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ.. టీబీ వ్యాధి నివారణకు టీబీ అలర్ట్ ఇండియా తమవంతు కృషిగా సహకారం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ సి.వి.ఎస్. రాజు, సూపర్ వైజర్లు శాంతి సంజీవని, సుబ్బారావు, ఆనంద వల్లీ, భరత్ తదితరులు పాల్గొన్నారు.



ఉన్నా లేనట్టే..!

మూడేళ్లుగా నిరుపయోగంగా శాంతినగర్ కమ్యూనిటీహాల్



నిర్వహణలేక చెత్తాచెదారంతో అధ్వాన్నంగా మారిన కమ్యూనిటీహాల్



శాంతినగర్లోని జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్



కమ్యూనిటీహాల్ గేటుకు పశువులను కట్టేసిన దృశ్యం

- అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం
- హాలులో విద్యుత్ సౌకర్యం కూడా లేని వైనం
- అధికారులు మొద్దు నిద్ర వీడాలని స్థానికు ఆగ్రహం

అడ్డగుట్ట: అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. ‘అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని ఉంది’అన్న చందంగా మారింది అడ్డగుట్ట డివిజన్ శాంతినగర్‌లోని కమ్యూనిటీహాల్ పరిస్థితి. రెండు అంతస్తుల నిర్మాణ పనులు పూర్తి చేసి మూడేళ్లు గడుస్తున్నా ఒక్క శుభకార్యం కూడా చేసుకునే వీలు లేకుండా పోయింది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోని కారణంగా పూర్తిగా అధ్వానంగా తయారైంది. అంతే కాకుండా అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారుతుంది. నిత్యం మద్యం బాబులు మద్యం సేవించి బాటిళ్లు అక్కడే పడేసి వెళ్తున్నారు. ఈ విధంగా అందుబాటులో ఉన్నటువంటి కమ్యూనిటీహాళ్లు అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా శాంతినగర్‌లోని కమ్యూనిటీహాల్‌పై దృష్టి సారించి వెంటనే ప్రారంభిస్తే శుభకార్యాలు, ఇతర సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఉంటుందని బస్తీవాసులు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరా కూడా లేదు..

నిధుల కొరత కారణంగా కమ్యూనిటీహాల్ నిర్మించడానికి సుమారు నాలుగు నుంచి ఐదు సంవత్సరాలు పట్టింది. అయితే ఎట్టకేలకు నిర్మాణం పూర్తయి కమ్యూనిటీహాల్ అందుబాటులోకి వచ్చిందనుకుంటే కేవలం చూసి సంతోష పడాల్సిన పరిస్థితి ఉందని స్థానికులు చెప్పుకొస్తున్నారు. హాలులో విద్యుత్ సరఫరా అందించడంలో కూడా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మూడు సంవత్సరాలుగా కమ్యూనిటీహాల్‌లో విద్యుత్ సరఫరా లేదు. దీంతో ఎటువంటి శుభకార్యాలు, సమావేశాలు వంటి కార్యక్రమాలు కూడా చేసుకోలేకపోతున్నామంటూ పలువురు ప్రజలు వాపోయారు.

మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగం..

ప్రస్తుతం చిన్న చిన్న శుభకార్యాలు చేయాలనుకున్నా ఫంక్షన్‌హాళ్లలో వేల రూపాయలు ఖర్చు అవుతున్నాయని, అటువంటిది స్థానికంగా ఉన్న కమ్యూనిటీహాల్‌ను అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని వినియోగించుకోలేక పోతున్నామని బస్తీవాసులు చెబుతున్నారు. దీంతో కమ్యూనిటీహాల్ పూర్తిగా మందుబాబులకు అడ్డాగా మారుతుంది. అంతే కాకుండా స్థానికంగా ఉండే వాళ్లు సదరు కమ్యూనిటీహాల్ గేట్లకు తమ పశువులను కట్టేస్తున్నారు. గతంలో నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో కూడా ఇదే విధంగా పశువులను కట్టేసేవారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తయినా కూడా ఈ కమ్యూనిటీహాల్‌కు పశువుల షెడ్డు మాదిరిగానే వాటిని కట్టేస్తున్నారని పలువురు తెలిపారు.



పట్టించుకునే వారే కరువయ్యారు..

ప్రభుత్వం మారిన తరువాత అభివృద్ధి పనుల విషయంలో స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లతో పాటు అధికారులు సైతం పట్టించుకోవడం లేదని శాంతినగర్ కమ్యూనిటీహాల్ సమీపప్రాంత వాసులు వాపోతున్నారు. స్థానికంగా ఉన్నటువంటి కమ్యూనిటీహాల్ అందుబాటులో ఉన్నప్పటికీ అందులో విద్యుత్ సరఫరా సౌకర్యం కలిగించలేదు. దీంతో కమ్యూనిటీహాల్ ఉన్నా...లేనట్టే అన్న విధంగా మారింది. దీని కారణంగా సదరు హాలు అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. సరైన మెయింటెనెన్స్ కూడా లేకపోవడంతో పూర్తిగా చెత్తా చెదారంతో అధ్వానంగా మారింది. అధికారులు కమ్యూనిటీహాల్‌పై దృష్టి సారించి తమకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

మాదిగ రిజర్వేషన్లు అమలు చేయాలి



సీతాఫల్‌మండి కూడలిలో నిరసన ప్రదర్శన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు.

సికింద్రాబాద్: మాదిగలకు రిజర్వేషన్లు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా సికింద్రాబాద్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు సీతాఫల్‌మండి కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్‌మాదిగ, జాతీయ అధికార ప్రతినిధి బొర్రా భిక్షపతి మాదిగ మాట్లాడారు. మాదిగల సహకారంతో ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచానని పలుమార్లు ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలోనే మాదిగలకు అన్యాయం జరుగుతోందన్నారు. మాదిగ రిజర్వేషన్లు అమలు చేయకుండానే టీచర్ పోస్టులు నియామకం, గ్రూప్ పరీక్షల ఫలితాలు విడుదల చేయడంతో మాదిగలకు తీరని అన్యాయం జరిగిందన్నారు.ఇప్పుడైనా మాదిగ రిజర్వేషన్లు అమలులోకి తెచ్చి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పు మల్లికార్జున్, సీతారాం, వేణుగోపాల్, శివప్రసాద్, యాదగిరి, విజయ్‌కుమార్, సాయికుమార్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యావంతులే టార్గెట్‌గా సైబర్ నేరాలు

చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి



సైబర్ నేరాల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి

సికింద్రాబాద్: తెలుగు రాష్ట్రాల్లోని విద్యావంతులను టార్గెట్‌గా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్లు ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి అన్నారు. సెల్‌ఫోన్ వినియోగించడం పట్ల, అపరిచితుల ఫోన్‌కాల్స్, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండటం పట్ల నేరగాళ్ల చేతిలో మోసపోకుండా ఉండవచ్చన్నారు. గురువారం సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్ కమ్యూనిటీ హాల్‌లో సైబర్‌నేరాలు, డ్రగ్స్ పట్ల అవగాహన కార్యక్రమాన్ని చిలకలగూడ డివిజన్ పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సైబర్ బాధితులో ఎక్కువ మంది విద్యవంతులే ఉండటం విచారకరమని అన్నారు.
– వస్తువుల విక్రయాలు, అశ్లీల ఫోన్‌కాల్స్, ఆన్‌లైన్ లోన్లు, గేమ్స్ పట్ల వచ్చే మొబైల్ కాల్స్‌కు స్పందించొద్దని సూచించారు. అపరిచితులు ఫోన్‌కాల్స్ ద్వారా భయభ్రాంతులకు గురి చేసినట్టయితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌గౌడ్, సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, మధురానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మచారి, ప్రధాన కార్యదర్శి రాజుసాగర్, వివిధ సంఘాల ప్రతినిధులు శైలేందర్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీధర్, మహేశ్, ప్రవీణ్‌రెడ్డి, అశోక్‌చారి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి



వారాసిగూడలో నిరసన తెలుపుతున్న పద్మశాలీ సంఘం నాయకులు

బౌద్ధనగర్: చేనేత మగ్గాన్ని అవమానపరిచే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాడారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని చేనేత వర్గాల చైతన్య వేదిక అధ్యక్షుడు చిక్కా దేవదాసు పేర్కొన్నారు. వెంటనే సీఎం పద్మశాలీలు, చేనేతలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం గ్రేటర్ వారాసిగూడ పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొమ్మ నరేందర్ ఆధ్వర్యంలో సంఘం కార్యాలయం వద్ద చేనేత మగ్గమును పసుపు నీళ్లలో శుద్ధి చేసి పాలాభిషేకం నిర్వహించారు. చిక్కా దేవదాసు మాట్లాడుతూ.. కాళ్లకు బూట్లు వేసుకొని చేనేత మగ్గంపై కూర్చుని నడిపిన విధానం తమను బాధించాయని అన్నారు. ఇటీవల ప్రకటించిన రూ.33 కోట్ల రుణమాఫీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బల్ల గీత, కూరపాటి సుమలత, చింతకింది సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి



బన్సీలాల్‌పేట్ జబ్బార్ కాంప్లెక్స్ సమీపంలో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బన్సీలాల్‌పేట్: ఎస్సీ వర్గీకరణ పూర్తి చేయకుండా ఎలాంటి ఉద్యోగ నియామకాలు చేపట్టరాదని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బన్సీలాల్‌పేట్ జబ్బార్ కాంప్లెక్స్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల ముందు ఎమ్మార్పీఎస్ నాయకులు మాచర్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టీవీ నర్సింహా, మాచర్ల ప్రభాకర్, ఎస్సీ ఆర్పీ అధ్యక్షులు డి. సుదర్శన్‌బాబు, కేఎం క్రిష్ణ, లక్ష్మీపతి, విజయ్‌శంకర్, దేశపాక శ్రీనివాస్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మాట ఇచ్చి తప్పారన్నారు. మాలల ఒత్తిడికి తలొగ్గి సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు అన్యాయం చేసే కుట్రలకు తెర లేపారన్నారు. గ్రూప్ 1, 2 ఉద్యోగ నియామకాల ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధక కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి మాదిగలు మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బట్టు క్రిష్ణ, ఉపేందర్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూములను కాపాడుకుంటాం

ఉస్మానియా యూనివర్సిటీ: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ)కు చెందిన 400 ఎకరాల భూముల విక్రయాల నిర్ణయాన్ని విరించుకోవాలని పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాపూరావు, అల్లూరి విజయ్ గురువారం పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టగానే వర్సిటీ భూములపై కన్నేసిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టగానే ప్రొ.జయశంకర్ వర్సిటీ భూములను స్వాధీనం చేసుకుందన్నారు. ఇప్పుడు హెచ్‌సీయూ భూములను కార్పొరేట్ కంపెనీలకు విక్రయించి సొమ్ము చేసుకోవాలని చూస్తోందన్నారు. వర్సిటీల భూముల జోలికి వస్తే అన్ని విద్యార్థి సంఘాలతో కలసి పెద్ద ఎత్తున ఉద్యమించనున్నట్లు హెచ్చరించారు.

తెలంగాణ వర్సిటీకి ఈశ్వరీబాయి పేరుపెట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ: నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ వర్సిటీకి దివంగత ఎమ్మెల్యే ఈశ్వరీబాయి పేరు పెట్టాలని డా.మంచాల లింగస్వామి గురువారం డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు సేవలందించిన ఆమె తెలంగాణ తొలిదశ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని అన్నారు. మహిళలను రాజకీయంగా చైతన్య పరిచిన ఈశ్వరీబాయి పేరు మీద వర్సిటీని స్థాపించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

కార్ఖానాలో ఇఫ్తార్ విందు



సాక్షి,సిటీబ్యూరో: సికింద్రాబాద్‌లోని కార్ఖానాలో గురువారం పీసీసీ మైనారిటీ వైస్ చైర్మన్ ఎం.ఏ హరూన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పీసీసీ సెక్రటరీ అయూబ్ ఖాన్, కార్ఖానా మసీద్ ప్రసిడెంట్ మిర్జా, నసీరుద్దీన్ తౌఫీక్ బాసీద్, ఎంఏ అలీమ్, ముజఫర్, ఆరీఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు

సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని సంపత్ అపార్ట్‌మెంట్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. బుధవారం అర్ధరాత్రి ప్రకాష్‌నగర్‌లోని సంపత్ అపార్ట్‌మెంట్ దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు వస్తుండడాన్ని గమనించిన స్థానికులు వెంటనే విషయాన్ని స్థానిక కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి దృష్టికి తీసుకువచ్చారు. ఆమె అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

యువతి అదృశ్యం

సికింద్రాబాద్: దుకాణానికి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... చిలకలగూడకు చెందిన యాదమ్మ కుమార్తె కావేరి(21)డి మార్ట్‌లో క్యాషియర్‌గా పనిచేస్తోంది. కొంత కాలంగా ఆమె చందు అనే యువకుడితో ప్రేమలో ఉంది. ఈనెల 11వ తేదీన చందు తన సోదరి, బావతో కలిసి పెళ్లి సంబంధం కోసం కావేరి ఇంటికి వచ్చాడు. కానీ కావేరి ఇంట్లో ఒప్పుకోలేదు. ఈనెల 12వ తేదీన కావేరి ఇంటి నుంచి డీమార్ట్ వెళ్లి అక్కడి నుంచి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్ల గాలించినా ఎక్కడా కనిపించ లేదు. దీంతో గురువారం చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసికున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి



నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కవయిత్రి మొల్లమాంబ జయంతిని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట పరిశోధన విద్యార్థి కంభంపాటి సత్యనారాయణ ప్రజాపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బీజీపీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మొల్ల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. పార్లమెంట్ మొల్ల విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. వర్సిటీ లేదా సాహిత్య అకాడమీకి ఆమె పేరు పెట్టాలని కోరారు. సాహిత్యంలో మొల్ల పేరుతో అవార్డును అందచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లింగంగౌడ్, డా.చలమల్ల వెంకటేశ్వర్లు, అశోక్, రాంబాబు, దుసుకు వేలాద్రి, కుమ్మరి సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్ డిమాండ్ చేశారు. గురువారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 15 నెలల కాంగ్రెస్ పాలనలో విద్యకు నిధుల కొరతతో గురుకుల హాస్టల్స్‌లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడం లేదన్నారు. గురుకులాలలో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.50లక్షల పరిహారం చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలన్నారు. ఓయూకు రూ.వేయి కోట్లు, ఇతర వర్సిటీలకు రూ.100 కోట్లు విడుదల చేయాలన్నారు. అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

వెట్టిచాకిరి నిర్మూలన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న ఆర్డీవో సాయిరామ్

రాంగోపాల్‌పేట్: బాల కార్మికులను దోపిడీకి గురికాకుండా అధికారులు అడ్డుకోవాలని సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరామ్ సూచించారు. గురువారం దివ్యదిశ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ఆర్డీవో కార్యాలయంలో వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ మండలాలకు చెందిన తహసీల్దార్లకు వెట్టిచాకిరి నిర్మూలన చట్టంపై అవగాహన కల్పించారు. ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, బాల కార్మికులు ఎక్కడ కనిపించినా వారిని విడిపించి పనిలోకి పెట్టుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ చట్టం రాష్ట్రంలో అమలులో ఉన్నా క్షేత్ర స్థాయిలో అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దివ్యదిశ డైరెక్టర్ ఫిలిప్స్, తదితరులు పాల్గొన్నారు.